
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 21 । మార్చి । 2025




హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం
విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి 10వ అండర్–19 జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు విజయవాడ ఆంధ్రా లయోలా కాలేజీ ప్రాంగణంలో గురువారం ప్రారంభమయ్యాయి.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 519 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిత్యాన్నదానానికి విరాళం
ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి గుడివాడకు చెందిన సుంకర బాలాంబ కుటుంబం రూ. 2,00,116 విరాళాన్ని అందజేసింది.



న్యూస్‌రీల్

కేజీబీవీలలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని 24 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, 11వ తరగతి (ఇంటర్మీడియెట్) ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ టి.వి.సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 7,8, 9, 10,12వ తరగతుల్లోనూ మిగిలిన సీట్లు భర్తీ చేసేందుకు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను https//apkgbv.apcfss.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన సూచించారు. వివరాలకు 97041 00406, 94406 42122 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

చర్లపల్లి-కన్యాకుమారి మధ్య సమ్మర్ వారాంతపు ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం సమ్మర్ వారాంతపు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ గురువారం తెలిపారు. చర్లపల్లి–కన్యాకుమారి వయా గుంటూరు డివిజన్ మీదుగా ఏప్రిల్ 2 నుంచి జూన్ 25 వ తేదీ వరకు ప్రత్యేక రైలు(07230) ప్రతి బుధవారం నడపనున్నట్టు వివరించారు. ఈ రైలు చర్లపల్లి స్టేషన్ నుంచి రాత్రి 9.50 గంటలకు బయలుదేరి రెండో రోజు అర్ధరాత్రి 2.30 గంటలకు కన్యాకుమారి స్టేషన్‌కు చేరుకుంటుందని వెల్లడించారు. అలాగే కన్యాకుమారి–చర్లపల్లి రైలు(07229) ఏప్రిల్ 4 నుంచి జూన్ 27 వరకు ప్రతి శుక్రవారం నడపనున్నట్టు వివరించారు. ఈ రైలు కన్యాకుమారి స్టేషన్ నుంచి తెల్లవారు జామున 5.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.40 గంటలకు చర్లపల్లి స్టేషన్‌కు చేరుకుంటుందని ఆయన వెల్లడించారు.

జయ గోవర్ధనా.. నారసింహా



మంగళగిరి టౌన్: మంగళాద్రిలోని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం స్వామి గోవర్ధనోద్ధరణ అలంకారంలో దర్శనమిచ్చారు. స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈవో రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. ఉత్సవ కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన శెనగల రామహనుమాన్, శేషాంజనేయ గోపాల్‌లు వ్యవహరించారు. ఆస్థాన కైంకర్యపరులుగా దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామానికి చెందిన వాసిరెడ్డి మల్లేశ్వరరావు వ్యవహరించారు. శుక్రవారం స్వామి గజేంద్ర మోక్షం అలంకారంలో దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఈవో రామకోటిరెడ్డి తెలిపారు.

స్థానిక సంస్థల్లో ఖాళీలకు 27న ఉప ఎన్నికలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని స్థానిక సంస్థల్లో వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానాలకు ఈనెల 27న ఉప ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఖాళీలను పరోక్ష విధానంలో ఎన్నికల ద్వారా భర్తీ చేయనున్నారు. ఈనెల 27న ఉదయం 10 గంటలకు నామినేషన్లు స్వీకరించిన అనంతరం మధ్యాహ్నానికి ఎన్నిక, ప్రమాణ స్వీకారంతో ప్రక్రియ ముగియనుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉప ఎన్నికల ద్వారా దుగ్గిరాల మండల పరిషత్ అధ్యక్షులు, గుంటూరు రూరల్ మండల పరిషత్ ఉపాధ్యక్ష స్థానంతో పాటు తెనాలి మండల నుంచి కో–ఆప్షన్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌ల స్థానాల వారీగా కొల్లిపర మండలం తూములూరు, చక్రాయపాలెం, మేడికొండూరు మండలం గుండ్లపాలెం, మేడికొండూరు, దుగ్గిరాల మండలం మంచికలపూడి, ప్రత్తిపాడు మండలం తిమ్మాపురం, పెదకాకాని మండలం వెంకటకృష్ణాపురం, పొన్నూరు మండలం బ్రాహ్మణకోడూరు, చేబ్రోలు మండలం శ్రీరంగాపురంలో ఎన్నికలు జరగనున్నాయి.

కూటమి పాలనలో స్మార్ట్ మోసం!

‘జగన్‌మోహన్ రెడ్డి మీ ఇంటికి స్మార్ట్ మీటర్లు పెడతారు.. పెట్టి కరెంటు బిల్లు ఎక్కువ వేసి దోచుకుంటారు..’ అని కూటమి నేతలు గతంలో అసత్య ప్రచారం చేశారు. తాము అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్ తీసేస్తామని ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి వచ్చాక మాత్రం స్మార్ట్ మీటర్లను బిగిస్తూ ప్రజలను నిండా ముంచేస్తున్నారు.



వ్యాపార దుకాణానికి ఏర్పాటు చేసిన స్మార్ట్ విద్యుత్ మీటర్

- రీచార్జి చేసుకుంటేనే ఇక విద్యుత్ సరఫరా
- పట్టణంలో కొనసాగుతున్న స్మార్ట్ మీటర్ల ఏర్పాటు
- గతంలో వ్యతిరేకించిన కూటమి నాయకులు
- నేడు దర్జాగా స్మార్ట్ మీటర్లు బిగించేందుకు అనుమతి
- ముందుగా వ్యాపార, ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు
- త్వరలో గృహ సముదాయాలకు అమర్చేందుకు చర్యలు

చీరాల అర్బన్: సెల్‌ఫోన్‌లో వేరొకరితో మాట్లాడాలంటే నెలావారీ ప్లాన్‌ను రీచార్జ్ చేసుకోవాల్సిందే. ప్రస్తుతం వినియోగించే విద్యుత్‌కు కూడా ముందుగానే డబ్బులు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన స్మార్ట్ మీటర్ల విధానం పేదలకు, నిరక్షరాస్యులకు భారంగా మారనుంది. నాడు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించిన కూటమి పెద్దలు.. నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్ల ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఇకపై విద్యుత్‌ను వాడుకోవాలంటే ముందస్తుగానే రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతుండగా ఏళ్ల తరబడి మీటరు రీడర్లుగా పనిచేస్తున్న చిరుద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుంది.

పట్టణంలో ప్రారంభమైన ప్రక్రియ..
చీరాల పట్టణంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. పట్టణంలో కమర్షియల్ సర్వీసులు 9,060, ప్రభుత్వ కార్యాలయాల సర్వీసులు 760, గృహ సర్వీసులు 66,563 ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుగా వ్యాపార సముదాయాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లును ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలో ఇప్పటి వరకు 30 శాతం మేర ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాల తర్వాత గృహ సర్వీసులకు కూడా బిగించనున్నారు.

పేదలపై పెను భారమే
ప్రస్తుతం విద్యుత్ మీటర్లు ద్వారా మనం ఎంత మేర వినియోగించుకుంటే అంతే ప్రతి నెల బిల్లు ఇస్తారు. బిల్లు అందిన 15 రోజుల వరకు అపరాధ రుసుం లేకుండా, మరో 15 రోజుల వరకు కొంత జరిమానాతో బిల్లు చెల్లించడానికి అవకాశం ఉండేది. ప్రస్తుతం స్మార్ట్ మీటర్ల వలన ఆ వెసులుబాటు ఉండదు. తప్పనిసరిగా స్మార్ట్ మీటర్లకు ముందే రీచార్జి చేసుకుని విద్యుత్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. రీచార్జ్ అయిపోతే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. విద్యుత్ మీటరు కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో ఎన్ని కిలోవాట్స్ విద్యుత్ అవసరమో తెలపాల్సి ఉంటుంది. అదనపు లోడు ఉన్నా వాడుకున్న విద్యుత్‌కు ఇప్పుడు బిల్లు చెల్లిస్తే సరిపోతుంది. అయితే స్మార్ట్ మీటర్లకు మాత్రం సర్వీస్ నెంబర్‌కు కిలోవాట్స్ చొప్పున రీచార్జి చేసుకోవాలి. పేద ప్రజలు ఈ విధానంపై తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సమయానికి విద్యుత్ బిల్లు చెల్లించేందుకు డబ్బులు లేకుంటే అపరాధ రుసుము చెల్లించి బిల్లులు కట్టుకునే వారూ ఉన్నారు. ముందుగానే డబ్బులు చెల్లిస్తేనే విద్యుత్ వాడకం చేసుకోవాల్సి రావడంతో ఈ విధానంపై తీవ్ర విమర్శలు గుప్పుమంటున్నాయి.

నాడు వ్యతిరేకించి నేడు అమలు

స్మార్ట్ విద్యుత్ మీటర్ల విధానంపై నాడు కూటమి నేతలు తీవ్ర విమర్శలు చేశారు. ఆ ప్రక్రియ నేడు అధికారం చేపట్టిన తర్వాత మొదలుపెట్టారు. ఈ విధానం వలన ప్రజలకు ఇబ్బందులు తప్పవు. ప్రీపెయిడ్ విధానంపై సరైన అవగాహన లేదు. అలానే విద్యుత్ మీటర్ రీడింగ్ తీసే సిబ్బంది ఉద్యోగాలకు గ్యారెంటీ కూడా ప్రశ్నార్థకమే.
– ఎన్.బాబూరావు, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి

మీటర్ రీడర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకం..

స్మార్ట్ మీటర్ల వలన విద్యుత్ మీటర్ రీడర్ల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనుంది. ప్రీపెయిడ్ విధానంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తుండడంతో ఉద్యోగం ఉంటుందో, ఉండదో అనే గందరగోళంలో వారున్నారు. చీరాల పట్టణంలో మీటరు రీడింగ్ తీసేందుకు ఎనిమిది మంది పనిచేస్తున్నారు. ఒక్కో మీటర్ రీడర్‌కు సుమారు 3 వేల కనెక్షన్లు అప్పగిస్తుంటారు. ఒక్కో మీటరు రీడింగ్ తీసినందుకు రూ.3 చొప్పున ఇస్తున్నారు. ఈ ఉద్యోగంపై ఆధారపడి జీవిస్తున్న వారికి స్మార్ట్ మీటర్ల విధానం గండంగా మారనుంది. తమకు కూడా న్యాయం చేయాలని వారు విన్నవిస్తున్నారు.

జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జిల్లాను అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ల కాన్ఫరెన్స్ నేపథ్యంలో స్థానిక కలెక్టరేట్‌లో ప్రగతి నివేదికలపై అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాను వ్యవసాయ అనుబంధ, పారిశ్రామిక రంగాలలో ప్రగతి పథంలో నిలిపేలా ప్రణాళికలు ఉండాలని సూచించారు. పర్యాటక రంగానికి అనుకూలమైన వాతావరణం ఉందని, 103 కిలోమీటర్ల సముద్ర తీరం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని గుర్తుచేశారు. మత్స్య సంపదకు వనరులు ఉన్నందున పరిశ్రమల స్థాపన దిశంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కృష్ణా నది పరివాహక ప్రాంతంలో వరదలు రాకుండా కరకట్ట అభివృద్ధికి తగిన ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. కృష్ణా, పశ్చిమ డెల్టా కాలువల మరమ్మతులపైనా దృష్టి పెట్టాలన్నారు. తాగు నీటి ఇబ్బందుల్లేకుండా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, జిల్లా గ్రామీణ నీటి సరఫరాశాఖ ఎస్ఈ అనంతరాజు, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.వెంకటేశ్వరరావు, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా అటవీశాఖ అధికారి భీమయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి కృష్ణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు రైల్వే రేక్ మూమెంట్‌తో ఎంతో మేలు

బాపట్ల: జిల్లాకు రైల్వే రేక్ మూమెంట్ రావడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. గురువారం బాపట్ల రైల్వే స్టేషన్‌లో రైల్వే రేక్ లోడింగ్, అన్ లోడింగ్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాకు కొత్త రైల్వే రేక్ రావడంతో జిల్లా రూపురేఖలు మారతాయని అన్నారు. రవాణా ఖర్చులు ప్రజలకు తగ్గుతాయని చెప్పారు. బాపట్ల జిల్లాకు పర్యాటకులు ఎక్కువ శాతం వచ్చే విధంగా వందే భారత్ ట్రైన్లు నిలుపుదల చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాపట్ల రైల్వే స్టేషన్‌కు వచ్చిన ట్రైన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి విలియమ్స్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, బాపట్ల రైల్వే స్టేషన్ మాస్టర్ మీనా, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, గొల్లపల్లి శ్రీనివాసరావు, శివరాం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మాకొద్దు మద్యం దుకాణం



పేటేరులో శివాలయం బజారులో ప్లకార్డులు చూపుతున్న చిన్నారులు

- పేటేరులో రోడ్డుపైకి వచ్చి మహిళల నిరసన
- కూటమి ప్రభుత్వం తీరుపై మండిపాటు
- తొలగించే వరకు పోరాడతామని హెచ్చరిక



ఆందోళన చేస్తున్న మహిళలు

రేపల్లె రూరల్: తమ గ్రామంలో మద్యం దుకాణం వద్దంటూ రేపల్లె మండలం పేటేరు గ్రామ ప్రజలు నడిరోడ్డుపైకి వచ్చారు. గురువారం రాత్రి ఆందోళనకు దిగారు. గ్రామం నడిబొడ్డున మహిళలు, విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగించే మార్గంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడమేంటని కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. బడి, గుడి, కల్యాణ మండపం ఉన్న ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులివ్వటం తగదన్నారు. ఇలాంటి దుకాణాలు తమ ఇళ్ల వద్ద కూడా ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వ పెద్దలు అంగీకరిస్తారా? అని గ్రామస్తులు ప్రశ్నించారు. దుకాణం ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేవరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఇక గుడికి వెళ్లే వీలుండదు



మహిళలు నిత్యం ఈ మార్గంలోనే గుడికి వెళ్తుంటారు. రాత్రి సమయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతుంటాయి. సాధారణంగానే ఇటువైపు మద్యం తాగి వచ్చేవారిని చూస్తుంటే భయంగా ఉంటుంది. ఏకంగా మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయాలనుకోవడం తగదు. మహిళలు, విద్యార్థినులను దృష్టిలో ఉంచుకుని ఆ ఆలోచనను విరమించుకోవాలి.
– సీతా మహాలక్ష్మి, పేటేరు

ఇళ్ల మధ్య ఎలా ఏర్పాటు చేస్తారు?



నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయాలని చూస్తే అంగీకరించేదే లేదు. షాపు వద్దని వ్యతిరేకించినా దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలా మద్యం దుకాణాలు లేవు. కుటుంబాలలో చిచ్చుపెట్టేలా ఇప్పుడు దుకాణం ఏర్పాటు చేస్తే ఆందోళన చేపడతాం.
– సుజాత, పేటేరు

మిర్చి యార్డులో వ్యాపారులకు లైసెన్సు తప్పనిసరి

- జీరో, కటింగ్ వ్యాపారం, మచ్చుకాయల దోపిడీకి అడ్డుకట్ట
- మల్టిపుల్ లైసెన్స్‌దారులపై చర్యలు
- ఇప్పటికే 134 మంది గుర్తింపు
- మరో 27 మందితో జాబితా సిద్ధం
- మరోసారి తనిఖీ చేశాక చర్యలు
- నిర్లక్ష్య ధోరణి, అవకతవకలకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు
- మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ సునీత



సమావేశంలో మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత, కాకుమాను శ్రీనివాసరావు తదితరులు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో వ్యాపారం చేయాలంటే తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ ఎం.విజయ సునీత స్పష్టం చేశారు. లైసెన్స్ లేకుండా మిర్చి వ్యాపారం చేసే వారి వల్ల ధర ప్రభావితమవుతోందని పేర్కొన్నారు. మిర్చి యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో మార్కెటింగ్‌శాఖ విజిలెన్స్ జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్, రీజినల్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావుతో కలిసి యార్డు అధికారులు, సిబ్బందితో గురువారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఒకే కుటుంబంలో రెండు, మూడు లైసెన్స్‌లు ఎలా ఇచ్చారని సంబంధిత అధికారులు, సిబ్బందిని వివరణ అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా యార్డులో జరిగిన, జరుగుతున్న అక్రమాలు, జీరో వ్యాపారం, కటింగ్ వ్యాపారం, మచ్చు కాయల దోపిడీపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ విజయ సునీత మాట్లాడుతూ నిర్లక్ష్య ధోరణి, అవకతవకలకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యార్డులో జరుగుతున్న వ్యవహారాలకు అధికారులు, సిబ్బంది బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. యార్డులో లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహించే వారిపై.. వ్యాపారం చేస్తూ చేయనట్లు చూపించే వారిపై.. గత రెండు, మూడు నెలలుగా తాము అడుగుతున్న సమాచారం ఇవ్వని దిగుమతి, ఎగుమతి వ్యాపారులపై చర్యలు తీసుకోవడం జరుగుతోందని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఒకే కుటుంబంలో మల్టిపుల్ లైసెన్స్‌లు కలిగి చట్టబద్ధంగా వ్యాపారం చేయకుండా ఐటీ ఎగ్గొట్టే ధోరణితో వ్యవహరిస్తున్న మిర్చి కమీషన్ ఏజెంట్స్‌పై దృష్టి సారించడంతో పాటు వారి జాబితాను రూపొందించామని చెప్పారు. వాటన్నింటిని క్రాస్ చెక్ చేసి 134 మందిని తేల్చడం జరిగిందన్నారు. దీంతోపాటు మరో 27 మంది జాబితా కూడా తయారు చేశామన్నారు. వీటన్నింటిని మరోసారి క్రాస్ చెక్ చేసి వారిపై చర్యలు తీసుకోవడానికి జాబితా రూపొందిస్తున్నట్లు వివరించారు. యార్డులో జీరో వ్యాపారం, కటింగ్ వ్యాపారం, మచ్చుకాయల దోపిడీకి అడ్డుకట్ట వేసి యార్డును మరింత ప్రక్షాళన చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. యార్డులో వ్యాపారం చేసే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని ఆదేశించారు. గుంటూరు యార్డుకు కర్నాటక రాష్ట్రం నుంచి అధికంగా మిర్చి బస్తాలు రావడం కారణంగా లోకల్ ఉత్పత్తిపై ఆ ప్రభావం పడి మిర్చి ధర తగ్గే అవకాశం కనిపిస్తోందని తెలిపారు. అధికారులు, వ్యాపారులు, సిబ్బంది అందరూ కలసికట్టుగా బాధ్యతాయుతంగా వ్యవహరించి మిర్చి రైతులకు మంచి ధర కల్పించేలా చూడాలన్నారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ విజిలెన్స్ జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్, మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు బి.రాజబాబు, మిర్చి యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక, యార్డు ఇన్‌చార్జి సుబ్రమణ్యం, అసిస్టెంట్ ఇన్‌చార్జి శ్రీకాంత్, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌పై పోస్టులు పెడితే సహించం

- పోలీసులు పక్షపాతం చూపుతున్నారు
- ప్రతిపక్ష నేతల ఫిర్యాదులు పట్టించుకోవడం లేదు
- వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు నారాయణ మూర్తి

తాడేపల్లిరూరల్ : వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టకు భంగం కలిగేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అంకిరెడ్డి నాగ నారాయణమూర్తి హెచ్చరించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌పై, మాజీ మంత్రి రోజాపై అసభ్య పోస్టులు పెట్టిన కొందరిపై గురువారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నారాయణమూర్తి ఫిర్యాదు చేశారు. అనంతరం నారాయణమూర్తి మాట్లాడుతూ పోలీసులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అధికారపార్టీ నేతలు ఫిర్యాదు చేస్తే క్షణాల్లో కేసులు నమోదు చేస్తున్నారని, ప్రతిపక్ష నేతలు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. అధికారపార్టీ నేతల ఒత్తిడితో ప్రతిపక్ష నేతలను పోలీసులు వేధిస్తున్నారని మండిపడ్డారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటి వరకు అనేక మార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల రాష్ట్ర అధ్యక్షులు కొండమడుగుల సుధాకర్ రెడ్డి, అడ్వకేట్ నారాయణ రెడ్డి, ముదిగొండ ప్రకాష్, గంజి షణ్ముఖ, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ పరిధిలో చేర్చండి

మంగళగిరిటౌన్: ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఏఎన్ఎంలను మెడికల్ హెల్త్ డిపార్ట్‌మెంట్ పరిధిలోకి మార్చాలని ఏఐటీయూసీ రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య, ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళగిరి ఆటోనగర్‌లోని విశాలాంధ్ర ముద్రణా కార్యాలయం నుంచి ఏపీఐఐసీ కార్యాలయం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏపీఐఐసీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు వెంకట సుబ్బయ్య తెలిపారు.



ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

అమరేశ్వరుడికి వేలం పాటల ద్వారా రూ.54.22 లక్షల ఆదాయం

అమరావతి: అమరేశ్వరుడికి వేలం పాటల ద్వారా రూ.54.22 లక్షలు ఆదాయం వచ్చింది. ఆలయంలో దుకాణాలకు గురువారం బహిరంగ వేలం పాటలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి 2026 మార్చి 31 వరకు పాటదారులు వ్యాపారాలు చేసుకోవచ్చని తెలిపారు. ఆలయంలో కొబ్బరి చిప్పలు పోగు చేసుకోవడాన్ని రూ. 9.51లక్షలకు, ఆవరణలో కొబ్బరికాయలు, పూజ సామగ్రి అమ్ముకునేందుకు రూ.17.20లక్షలు, పార్కింగ్ రుసుం వసూలును రూ.10.61లక్షలకు, బొమ్మలు అమ్ముకునే హక్కుకు రూ.3.90 లక్షలకు, నదీ తీరంలో కూల్‌డ్రింక్స్ షాపునకు రూ.9.9లక్షలకు, చెప్పుల స్టాండ్ నిర్వహణకు రూ. 2.66 లక్షలకు, తలనీలాలకు రూ. 20వేలు, మొదటి ప్రాకారంలో కూల్‌డ్రింక్స్ షాపు నిర్వహణకు రూ. 1.5లక్షలకు పాడుకున్నట్లు ఆయన వివరించారు. స్వామికి ఆదాయం గత ఏడాది రూ. 49.44 లక్షలు రాగా ఈ ఏడాది రూ.54.22 లక్షలు వచ్చినట్లు చెప్పారు. గత ఏడాది కంటే రూ.4.78 లక్షలు అధికంగా వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

సిండికేట్‌తో ఆదాయానికి గండి
పాటదారులు సిండికేట్ కావడంతో అమరేశ్వరుని ఆదాయానికి గండిపడింది. ఒకటి, రెండు వ్యాపారాలకు తప్పా మిగిలిన అన్నింటిలో పాటదారులు సిండికేట్ అయ్యారు. అధికారులు కూడా పార్కింగ్, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కుకు అధిక మొత్తంలో పాట పెంచారు. మిగిలిన వ్యాపారాలకు తక్కువ మొత్తంలో పెంచి మమ అనిపించారు. ఈ విధంగా దేవుని ఆదాయానికి గండి కొట్టటం దారుణమని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

క్లుప్తంగా

ఆర్ అండ్ బీ ఈఈగా రాజానాయక్



బాపట్ల: రోడ్లు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను ఆర్.రాజానాయక్ గురువారం స్వీకరించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

సాగర్ డ్యాంను సందర్శించిన సీఈ



విజయపురి సౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్టు మెయిన్ డ్యాం ఎడమ వైపున ఎర్త్ డ్యాంపై ఎండిపోయిన కార్పెట్ గ్రాస్‌కు బుధవారం సాయంత్రం నిప్పంటుకుని పూర్తిగా తగలబడింది. అగ్ని ప్రమాదంలో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు గురువారం నల్లగొండ జిల్లా చీఫ్ ఇంజినీర్ అజయ్‌కుమార్, సాగర్ డ్యాం సర్కిల్ ఈఈ శ్రీధర్ రావు, ఈఈ మల్లికార్జునరావు, ఇంజనీర్లు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాను నిలిపి వేశామని, తిరిగి లైన్లు కలిపితే ఏమేరకు నష్టం జరిగిందో తెలుస్తుందని చెప్పారు. కేబుల్స్ కాలిపోయినా, సీసీ కెమెరాలు బాగానే ఉన్నట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో జరిగిన నష్టాన్ని త్వరలో తేలుస్తామని, తిరిగి కేబుల్స్‌ను ఆధునికీకరిస్తామని చెప్పారు. ఈసారి అగ్ని ప్రమాదాలు జరిగినా నష్టం జరగకుండా జీఏ పైపుల నుంచి హెచ్‌డీ పైపులు వేసి, అందులో నుంచి కేబుల్స్ వచ్చేలా చూస్తామని ఆయన వివరించారు.

ఇసుక రీచ్ కార్మికులకు అండగా వైఎస్సార్‌సీపీ

- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- తహసీల్దారుతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి



రీచ్‌లో ట్రాక్టరుకు ఇసుక లోడ్ చేస్తున్న వరికూటి అశోక్‌బాబు

వేమూరు: ఇసుక రీచ్ కార్మికుల ఆకలి తీరే వరకు తాను పస్తులుండైనా పోరాటం చేస్తానని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. కొల్లూరు మండలంలోని జువ్వలపాలెంలోని ఇసుక రీచ్ కూలీలకు అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. గురువారం ఇసుక రీచ్ వద్దకు ఆయన వెళ్లారు. కూటమి ప్రభుత్వం నదీ పరివాహక ప్రాంతంలో ఇసుక తరలిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామంలోని దళిత కాలనీకి చెందిన రీచ్ కార్మికులకు పని లేకుండా చేసి వారి కుటుంబాలను ఆకలి అలమటింపజేస్తున్నారని పాలకుల తీరుపై మండిపడ్డారు. వారి పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. వారికి తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. ట్రాక్టర్లకు, టైరు బండ్లకు ఇసుక లోడ్ చేయకుండా కూటమి నాయకులు అడ్డుకుంటున్నట్లు కూలీలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అటుగా వెళ్లకుండా గండి కొట్టారని చెప్పారు. కొల్లూరు తహసీల్దారును అశోక్‌బాబు కలిసి మాట్లాడటంతో గండి పూడ్చి వేయించారు. కూలీలను ఇసుక లోడింగ్ చేసుకోమని ఆదేశాలిచ్చారు. అశోక్‌బాబు స్వయంగా ట్రాక్టరుపై రీచ్ నుంచి జువ్వలపాలెం వరకు కార్మికులను తీసుకొచ్చారు. కూటమి నాయకులు ఇతర రాష్ట్రాలకు ఇసుక తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అశోక్‌బాబు మండిపడ్డారు. యంత్రాలతో రాత్రి వేళ వందల లారీలలో ఇసుక నింపి తరలిస్తున్నట్లు ఆరోపించారు. ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు దీనిపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఇసుక రీచ్‌లో పని ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. స్టేషన్ లోపలికి కూటమి నాయకులను అనుమతిస్తూ ప్రతిపక్ష నేతలను మాత్రం రోడ్డుపై నిలబెట్టడం దారుణమని పోలీసుల తీరుపై అశోక్‌బాబు అసహనం వ్యక్తం చేశారు. జువ్వలపాలెం గ్రామానికి చెందిన రైతు ప్రసాద్‌పై దాడి జరగడంతో అడిగేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులను రోడ్డుపై నిలపడం తగదన్నారు. వేమూరు సీఐతోపాటు ఎస్ఐ రవికృష్ణ తీరు మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు సుగున మల్లేశ్వరరావు, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, ఉప సర్పంచ్ శౌంతి కోటేశ్వరరావు, గాజుల శ్రీనివాసరావు, వెలివెల రామకృష్ణ, చిలకా ప్రకాశ్, కూచిపూడి మోషే, మస్తాన్ బాషా, దున్నా మేరీ సుబాబు, ఎంపీటీసీ బాబీ, డాక్టర్ డి.గోపి, ధూళ్లపూడి రాంబాబు, కోగంటి కోటేశ్వరరావు, తాడికొండ రాంబాబు, లాజురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు 122 దరఖాస్తులు ఆమోదం



కార్యాలయంలో సమీక్ష చేస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటులో భాగంగా సింగిల్ డెస్క్ పోర్టల్‌పై ఈ నెలలో వచ్చిన 129 దరఖాస్తులకు గాను 122ను ఆమోదించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎం.సుధాకర్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పలు అంశాలపై జేసీ సమీక్ష చేశారు. సింగిల్ డెస్క్ పోర్టల్ క్లియరెన్స్, ఎస్సీ, ఎస్టీలకు పెట్టుబడి రాయితీ, పారిశ్రామిక అభివృద్ధిలో రాయితీ విధానం, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన, సులభతర వ్యాపారంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, క్లస్టర్ డెవలప్‌మెంటు ప్రోగ్రాం తదతర పలు అజెండాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధాన మంత్రి ఉపాధి హామీ పథకానికి సంబంధించిన కేవైసీ ద్వారా దరఖాస్తుల ప్రాసెస్ వేగవంతంగా చేయాలని చెప్పారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో ఇప్పటి వరకు 4950 మందికి శిక్షణ ఇచ్చామని, 3,357 దరఖాస్తులను బ్యాంకులకు పంపించామని జేసీ తెలిపారు. ఇందులో 521 మంజూరై 452 యూనిట్లకు రుణాలు విడుదల చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని రైతు మృతి

కారెంపూడి: గుర్తు తెలియని వాహనం ఢీకొని రైతు మృతి చెందిన ఘటన మండలంలోని నరమాలపాడులో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు మాదరాజు రవి తెల్లవారుజామున అడిగొప్పల వైపు రోడ్డు పక్క నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో రవి (31) అక్కడికక్కడే మృతి చెందాడు. ఐదు గంటలకు అటుగా పొలం పనులకు వెళ్తున్న వారు చూసి బంధువులకు సమాచారం అందించారు. రవి కుడి చేయి గూడ దగ్గర విరిగిపోయింది. కుడి కాలుపై బలమైన గాయం కన్పిస్తోంది. ఎస్ఐ వాసు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కవల ఆడపిల్లలున్నారు. ఈ ఘటనతో గ్రామంలోని బీసీ కాలనీలో విషాదం అలుముకుంది.

కిలోన్నర గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

అమరావతి: మండల పరిధిలోని ధరణికోట ఆరు డొంకల బావి సెంటర్ సమీపంలో గురువారం మధ్యాహ్నం పోలీసులు దాడి చేసి కిలోన్నర గంజాయిని పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ఆరు డొంకల బావి సెంటర్ సమీపంలోని పాగు బడిన కోళ్ల ఫారంలో గంజాయిని దాస్తుండగా పోలీసులు దాడి చేశారు. గమనించిన నిందితులు అక్కడే వదిలేసి పారిపోయారు.
పోలీసులు కిలోన్నర గంజాయితో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ అచ్చియ్య మాట్లాడుతూ పారిపోయిన వారి కోసం పోలీసు బృందాలు, ఈగల్ టీంలు గాలిస్తున్నాయని తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకున్న తర్వాత కేసు నమోదు చేస్తామని ఆయన చెప్పారు.

జయహో భారత్.. జయహో సునీత !

100 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తులసి, విద్యార్థులు

అచ్చంపేట: మహిళా శక్తికి ప్రతీకగా నిలచిన భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్ తొమ్మిది నెలల తరువాత సురక్షితంగా భూమిపైకి తిరిగి వచ్చిన సందర్భంగా మండలంలోని వేల్పూరు జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు 100మీటర్ల జాతీయ జెండాతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టి.తులసి మాట్లాడుతూ సునీత విలియమ్స్ సురక్షితంగా భూమిపైకి వచ్చిన క్షణాలు అద్భుతమని, ఆమె ధైర్య సాహసాలు అనితరసాధ్యమని కొనియాడారు. ఈ విజయం యావత్ భారతావని గర్వించదగినదని పేర్కొన్నారు. సునీత విలియమ్స్ భారతదేశంలోని ప్రతి మహిళకు స్ఫూర్తిదాయకంగా నిలిచిపోతుందని తెలిపారు. జయహో భారత్..జయహో సునీత విలియమ్స్ అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అగస్టీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు మస్తాన్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊయలే ఉరి తాడైంది !

ఆగిన బాలుడి ఊపిరి



అద్విక్‌రెడ్డి మృతదేహం

రెంటచింతల: ప్రతి రోజూ సరదాపడి ఊగే ఊయలే తన ప్రాణం తీస్తుందని ఆ బాలుడు ఊహించలేకపోయాడు. రోజూ మాదిరే ఇంట్లో చీరతో ఊయల కట్టుకుని ఊగుతున్న సమయంలో మెడకు బిగుసుకుని ఊపిరాడక మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా రెంటచింతలలో చోటుచేసుకుంది. వెంకటేశ్వరస్వామి మాణం కాలనీకి చెందిన సలిబండ్ల అద్విక్‌రెడ్డి(11) ఆరోగ్యం బాగో లేదని చెప్పి గురువారం పాఠశాలకు వెళ్లకుండా, అమ్మమ్మ ఇంటి పైగదిలో చీరతో కట్టిన ఊయల ఊగుతున్నాడు. మధ్యాహ్నం అన్నం తినడానికి కిందకు అద్విక్‌రెడ్డి రాకపోవడంతో అమ్మమ్మ కటకం శౌరీలు పైకి వెళ్లి చూసింది. ఊయల చీర అద్విక్‌రెడ్డి మెడకు బిగుసుకుని పోయి ఉండటం గమనించి కేకలు వేసింది. బంధువులు వెంటనే స్థానిక వైద్యుని దగ్గరకు తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. అద్విక్‌రెడ్డి స్థానిక ఫాతిమా విద్యానికేతన్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. బాలుడి తల్లి నిర్మలరాణి ఆదే పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తోందని. తల్లి, బంధువులు రోదిస్తున్న తీరు అక్కడ వారిని కంట తడి పెట్టించింది. విద్యార్థి అద్విక్‌రెడ్డి అకాలమృతికి పాఠశాల డైరెక్టర్ ఏరువ మల్రెడ్డి, హెచ్‌ఎం ఏరువ స్టేఫీ స్టార్ సంతాపం తెలిపారు. పాఠశాలకు సెలవు ప్రకటించారు.

పోలీస్ కస్టడీకి సోషల్ మీడియా యాక్టివిస్టు రాకేష్‌గాంధీ

చిలకలూరిపేట: సోషల్ మీడియా యాక్టివిస్టు దొడ్డా రాకేష్ గాంధీని రెండు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బెయిల్ మంజూరు చేయాలని అతని తరఫు న్యాయవాదులు, కస్టడీకి అప్పగించాలని పోలీసు తరఫు న్యాయవాదులు బుధవారం చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వాదనలు వినిపించారు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి రాకేష్ గాంధీ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేశారు. అతడిని రెండు రోజుల పాటు చిలకలూరిపేటలో పోలీస్ కస్టడీకి అనుమతించారు.

ఉరి వేసుకుని యువకుడు మృతి

తాడేపల్లిరూరల్: అంజిరెడ్డి కాలనీకి వెళ్లే రహదారిలో చెట్టుకు ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. చెట్టుకు వేలాడుతున్న వ్యక్తిని చూసి స్థానికులు గురువారం ఉదయం తాడేపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన యస్ఐ ఖాజావలి మృతదేహాన్ని కిందికి దించి పరిశీలించారు. యువకుడి జేబులో ఉన్న ఆధారాలను బట్టి యువకుడి పేరు సులేమాన్ తిర్కా అని, జార్ఖండ్‌లోని గుమ్మెల్లి వాసిగా గుర్తించామని ఖాజావలి వెల్లడించారు. హౌరా నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించినట్టు టికెట్ ఉందని, ఉదయం కృష్ణాకెనాల్ జంక్షన్ వద్ద దిగి ఇక్కడ ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నామని వెల్లడించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, జార్ఖండ్‌లో ఉన్న అతడి బంధువులను సంప్రదించడానికి యత్నిస్తున్నామని పేర్కొన్నారు.

పార్టీ శ్రేణులకు గాదె భరోసా

- ఫారం 7 విషయంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై సిట్ విచారణకు ఎమ్మెల్యే ఫిర్యాదు
- కోర్టుకు వెళ్లి ధైర్యం నింపిన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె
- కూటమి ప్రభుత్వం వెనక్కి తగ్గడంతో గాదెకు పార్టీ నేతలు, కార్యకర్తలు కృతజ్ఞతలు



మధుసూదనరెడ్డి

పర్చూరు(చినగంజాం): నమ్మిన నాయకులను, కార్యకర్తలను ఆపదలో ఆదుకుంటానని నిరూపించారు పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి. తన తండ్రి గాదె వెంకటరెడ్డి బాటలో నడుస్తూ పార్టీ శ్రేణులంటే ఎంతో అభిమానం చూపుతున్నారు. ఇందుకు ఫారం 7 దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురిచేసిన సమస్యను పరిష్కరించిన తీరు నిదర్శనంగా నిలిచింది. పర్చూరు నియోజకవర్గంలో 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అందించిన ఫారం 7 ఫిర్యాదులకు సంబంధించి ఎన్నికల కమిషన్ విచారణ నిర్వహించి తగు చర్యలు తీసుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఈ ఫారం 7 విషయం తెరపైకి తీసుకొచ్చారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఆయనే స్వయంగా ఫిర్యాదు చేశారు. దీనిపై సిట్ విచారణ చేపట్టాలని ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి, విచారణ బృందాన్ని ఏర్పాటు చేయించారు.

ఉపసంహరించుకున్న ప్రభుత్వం..

ఈ విషయాన్ని గాదె మధుసూదనరెడ్డి దృష్టికి ఫారం 7 అర్జీదారులు, నాయకులు, కార్యకర్తలు తీసుకొచ్చారు. హైకోర్టు లాయర్లతో ఆయన చర్చించి మార్చి 12వతేదీ కేసు ఫైల్ చేయించారు. అదే రోజు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, హోం సెక్రటరీ, ఎమ్మెల్యే, చీఫ్ సెక్రటరీలకు కోర్టు నోటీసులు జారీ చేసింది. మార్చి 18వ తేదీన విచారణ చేపట్టిన కోర్టు.. రాష్ట్ర ప్రభుత్వం వాయిదా కోరడంతో వాయిదా వేసింది. ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కే విజయానంద్ ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేశారు. ఈ విషయమై నియోజకవర్గంలో ఫారం 7 అర్జీదారులు, నాయకులు, కార్యకర్తలు మధుసూదనరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మిర్చి రైతులకు సాగునీటి కష్టాలు

ఎస్‌ఎస్పీ డీఈని కలిసి వినతిపత్రం అందజేత



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

నరసరావుపేట: జిల్లాలో వారబందీ అమలులో ఎండ తీవ్రతకు మిర్చి పంట ఎండిపోతోందని, తక్షణమే సాగునీరు విడుదల చేసి పంటలను రక్షించాలని ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రొంపిచర్ల మండలం వీరవట్నం గ్రామానికి చెందిన మిర్చి రైతులతో కలిసి నాగార్జునసాగర్ సంతగుడిపాడు సర్కిల్ డీఈ ఎస్.విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ లక్షల రూపాయల పెట్టుబడులు ఒకవైపు, చీడపీడల బెడద మరోవైపు, ధరలు లేమితో తీవ్ర ఆందోళనలో ఉన్న రైతులకు నీటి కష్టాలు తోడు కావడంతో మరింత ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని చెప్పారు. పంటకు నీరు ఇవ్వకపోతే తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. సాగునీటి కోసం ఆందోళన చెందడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. గతంలో నాగార్జునసాగర్ జలాశయంలో డెడ్ స్టోరేజ్ ఉన్న సమయంలో కూడా సాగుకు సరిపడా నీరు విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తక్షణమే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను ఏకంచేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న పంటలు, నీటి అవసరాలపై ఎస్‌ఎస్పీ అధికారుల దగ్గర వివరాలు లేకపోవడం వారి నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని తెలిపారు. ప్రస్తుతం సాగులో ఉన్న మిర్చి, మొక్కజొన్న, దాళ్వా వరి, ఇతర కూరగాయ పంటలు దెబ్బ తినకుండా ఏప్రిల్ 20 వరకు సాగునీరు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన డీఈ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని, తక్షణమే నీరు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విలువలకు 'కూటమి' తూట్లు

- సూపర్ సిక్స్ హామీల అమలు ఎప్పుడు ?
- పంట కాలం ముగిసే వరకు సాగునీరు ఇవ్వాలి
- సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో గుంటూరు విజయకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

నరసరావుపేట: ప్రజాస్వామ్యం, విలువల గురించి ఎన్నికలకు ముందు మాట్లాడిన కూటమి ప్రభుత్వ నాయకులు అధికారంలోకి వచ్చాక వాటికి తూట్లు పొడుస్తున్నారని, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ విమర్శించారు. స్థానిక కోటప్ప కొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో గురువారం జిల్లా కమిటీ సభ్యులు వై.రాధాకృష్ణ అధ్యక్షతన పల్నాడు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20వేలు ఇవ్వకుండా మొండిచేయి చూపారని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధరలు, దిగుబడులు లేక రైతాంగం అల్లాడుతోందని చెప్పారు. రైతుల పక్షాన మాట్లాడిన రైతు సంఘం నాయకులను టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని సమర్థంగా అమలు చేసి, వలసలు నివారించి, 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కూలీలు వలస వెళ్తున్న క్రమంలో ప్రమాదాల బారిన పడి ఆరుగురు చనిపోగా, 70 మందికి పైగా గాయపడ్డారని పేర్కొన్నారు. వారందరికీ న్యాయం చేయాలని విజయకుమార్ కోరారు. బసకచర్ల పేరుతో వరికపూడిశెల ప్రాజెక్ట్‌ను నిర్లక్ష్యం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ప్రజలు, రైతులను ఏకం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. వెనకబడిన పల్నాడు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పార్టీ చేపట్టే పోరాటాలకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని ఆయన కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో యూటీఎఫ్ ప్రకటించిన అభ్యర్థి విజయం కోసం పనిచేసిన నాయకులు, ప్రజాసంఘాలపై కూటమి నేతలు బెదిరింపులకు పాల్పడడం తగదని ఆయన ఖండించారు. ఎన్నికల రోజున ఓటమి భయంతోనే కూటమి నేతలు ఏజెంట్లపై దాడులు, రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఏపూరి గోపాలరావు, జి.రవిబాబు, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, ఎస్.ఆంజనేయనాయక్, సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.శివకుమారి పాల్గొన్నారు.

వర్గీకరణ పేరుతో కూటమి చిచ్చు

- త్వరలో లక్షలాది మందితో హలో మాల.. చలో రాజధాని కార్యక్రమం
- మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్



రోడ్డుపై బైఠాయించిన నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఎస్సీ వర్గీకరణపై రాజీవ్‌రంజన్ మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికను శాసనసభ, మండలిలో ఆమోదించిన కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా వ్యవహరిస్తోందని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్ మండిపడ్డారు. మాలమహానాడు ఆధ్వర్యంలో లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గోళ్ల అరుణ్‌కుమార్ మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో బాబు ప్రభుత్వం దళితుల మధ్య చిచ్చుపెడుతోందని ధ్వజమెత్తారు. రానున్న రోజుల్లో హలో మాల.. చలో రాజధాని పేరుతో లక్షలాది మందితో మాలల సింహగర్జన నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు గోదాజాన్‌పాల్, దారా హేమప్రసాద్, పిల్లి మేరి, ఏసుబాబు, బోరుగడ్డ రజనీకాంత్, రాచకొండ ముత్యాలరాజు, బండ్లమూడి స్టాలిన్, నల్లపు నీలాంబరం, సముద్రాల కోటి, డేవిడ్ విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.